

సోమశిలలో 17.898 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 17.898 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 306 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,480
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,449
3 శాతం జీఎస్టీతో..	రూ.5,612
సవర (8 గ్రా)	రూ.44,896

గరిష్టం/కనిష్టం
38.6 /29.7

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 45 శాతం ఉంది. మంగళవారం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఉత్తమ ఆరోగ్యమిత్రకు పురస్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆరోగ్యమిత్ర శివప్రసాద్

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు అర్బన్‌లో ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్న బి.శివప్రసాద్‌కు జూలై నెలకు గాను ఉత్తమ ఆరోగ్యమిత్ర పురస్కారాన్ని కలెక్టర్ హరినారాయణన్ అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో శివప్రసాద్‌కు కలెక్టర్ ప్రశంసాపత్రం, రూ.5 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రతి నెలా ఒక ఉత్తమ ఆరోగ్యమిత్రను ఎంపిక చేస్తారని తెలిపారు. జూలై నెలకు శివప్రసాద్‌ను ఎంపిక చేయడంతో పురస్కారం అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


30 నుంచి రెవెన్యూ క్రీడాకారుల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో నిర్వహించే సివిల్ సర్వీస్ క్రీడా పోటీల్లో పాల్గొనే నెల్లూరు జిల్లా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపికలను ఈ నెల 30, 31వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సెట్నల్, డీఎస్ఏ చీఫ్ కోచ్, సీఈఓ నాగరాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ పోటీలను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో, లాన్ టెన్నిస్ పోటీలను దర్గామిట్టలోని నెల్లూరు క్లబ్‌లో నిర్వహిస్తామని తెలిపారు. 31వ తేదీన స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, యోగా పోటీలను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల ఉద్యోగులు సంబంధిత పత్రాలు, క్రీడా దుస్తులతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 4 నుంచి 8వ తేదీ వరకు గుంటూరు, విజయవాడల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

నిబంధనల మేరకు ఓటర్ల జాబితా సవరణ

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తి చేయాలని, లేకుంటే ఇబ్బందులు ఎదుర్కొంటారని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఎన్నికల అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల అధికారులు ఫాం-7 సేకరించడం, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో సేకరించిన సమాచారం మేరకు అన్నిరకాల ఓటర్ క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పూర్తి చేయాలన్నారు. డెత్, షిఫ్టెడ్ ఓటర్లకు సంబంధించి నిశితంగా రీ వెరిఫికేషన్ చేపట్టాలన్నారు. సేకరించిన అన్ని దరఖాస్తులు మూడేళ్లపాటు భద్రపరిచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వెంకటనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌లో మోసపోయాం




మాట్లాడుతున్న గురుకులం విద్యార్థులు

నెల్లూరు(దర్గామిట్ట): ఎంసెట్-2023 వెబ్ కౌన్సెలింగ్‌లో గురుకుల విద్యార్థుల హాల్ టికెట్, వారికి వచ్చిన ఓటీపీలను తీసుకున్న వ్యక్తి అతను సూచించిన ప్రైవేట్ కళాశాలలో సీట్లు వచ్చేలా చేసి తమను మోసం చేశాడని కలెక్టర్ ఎం.హరినారాయణన్‌కు విద్యార్థులు తమ గోడును వెల్లబోసుకున్నారు. తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు మాట్లాడుతూ పెద్దపవనిలో గల అంబేడ్కర్ గురుకులంలో ప్రిన్సిపల్ స్నేహలత సిఫార్సుతో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ముప్పాళ్ల రవి అనే వ్యక్తి ఎంసెట్ కౌన్సెలింగ్‌కు సంబంధించి పలువురు విద్యార్థుల నుంచి హాల్‌టికెట్లు, తమ ఫోన్‌లకు వచ్చిన ఓటీపీలు తీసుకుని వెబ్ కౌన్సెలింగ్‌లో తాము పెట్టిన ఆప్షన్లు కాకుండా ప్రైవేట్ కళాశాలలో సీట్లు వచ్చేలా ఎంపిక చేశాడని విద్యార్థులు వాపోయారు. రెండో కౌన్సెలింగ్‌లోనైనా తమకు వచ్చిన ర్యాంకు ఆధారంగా రావాల్సిన సీట్లు కేటాయించాలని విన్నవించారు.

బత్తాయికి భలే గిరాకీ



ప్రస్తుతం బత్తాయికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణలో భాగంగా బత్తాయి జ్యూస్ తాగేందుకు మక్కువ చూపుతున్నారు. గత టీడీపీ పాలనలో కరువుతో జిల్లాలో బత్తాయి తోటలు ఎండిపోయి రైతులు ఆర్థికంగా కుదేలయ్యారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏటా వర్షాలు సమృద్ధిగా కురిసి వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, ధరలు ఆశాజనకంగా ఉండడం, ఉద్యాన పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వడంతో జిల్లా రైతులు బత్తాయి సాగుపై ఆసక్తి చూపుతున్నారు.



వరికుంటపాడు మండలంలో కొత్తగా సాగులో ఉన్న బత్తాయి తోట

విదేశాల్లో మంచి డిమాండ్
- ఎగుమతి చేస్తున్న వ్యాపారులు
- ఉత్తరాది రాష్ట్రాలకు, బెంగళూరు, చెన్నై మార్కెట్లకు తరలింపు
- ఆశాజనకంగా ధరలు
- రైతులకు గిట్టుబాటవుతున్న సాగు

ఉదయగిరి: ఈ సీజన్‌లో బత్తాయి కాయలకు మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో ఈ తోటలు సాగు చేసిన రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ధర మరింత ఆశాజనకంగా ఉందని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లోని రైతులు అధికంగా బత్తాయి సాగు చేస్తున్నారు. అందులో ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాలైన అనంతపురం, వైఎస్సార్, కర్నూలుతోపాటు నెల్లూరు జిల్లాలో సాగు అధికంగా ఉంది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలంగా ఉండడంతో దిగుబడులు ఎక్కువగా పొంది లాభదాయకంగా ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం అక్కడక్కడా కాయలు కోసి మార్కెట్‌కు తరలిస్తున్నప్పటికీ, వచ్చే నెలలో కోతలు ముమ్మరంగా ఉంటాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం బత్తాయి వినియోగం పెరగడంతో మార్కెట్‌లో టన్నుకు రూ.35 వేల వరకు ధర పలుకుతోంది.

16 వేల హెక్టార్లలో సాగు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రైతులు 16 వేల హెక్టార్లలో బత్తాయి తోటలు సాగు చేస్తున్నారు. జిల్లాలోని వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, సీతారామపురం మండలాల్లో 1,920 ఎకరాల్లో, వింజమూరు, కొండాపురం, కలిగిరి, జలదంకి మండలాల్లో 600 ఎకరాల్లో బత్తాయి తోటలు సాగులో ఉన్నాయి. అలాగే ఆత్మకూరు, కావలి, వెంకటగిరి నియోజకవర్గాల్లో కూడా బత్తాయి సాగు అధికంగా ఉంది. గత నాలుగేళ్ల నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతులు మరలా బత్తాయి సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. అంతేకాక ప్రభుత్వం కూడా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు 90 శాతం సబ్సిడీతో అందించడంతోపాటు వివిధ రకాల ప్రోత్సాహకాలు ఇస్తుండడంతో లేత తోటలు అధికంగా సాగులో ఉన్నాయి. ఈ ఏడాది 41 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో..

బత్తాయి సాగు విస్తీర్ణం - సుమారు 16 వేల హెక్టార్లు

దిగుబడి అంచనా - 41 వేల మెట్రిక్ టన్నులు

ధరలు ఆశాజనకం

ప్రస్తుతం రైతుల వద్ద నుంచి వ్యాపారులు టన్ను కాయలను రూ.35 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ సీజన్ ముగిసే నాటికి ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. గతేడాది ఈ సీజన్‌లో టన్ను కాయల ధర రూ.25 వేలు మాత్రమే ఉందని, ఈ ఏడాది ధర కొంత మెరుగ్గా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విదేశాలకు ఎగుమతి

ఈ ఏడాది జిల్లా నుంచి నాణ్యమైన బత్తాయి కాయలను అరబ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా బెంగళూరు, ఢిల్లీ మార్కెట్ల నుంచి నేపాల్, సింగపూర్, మలేసియా, బ్రిటన్, ఐర్లాండ్, అమెరికా, అరబ్ దేశాలకు ఎగుమతి జరుగుతున్నాయి. మన ప్రాంతంలో కాసే బత్తాయికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు తోటల వద్దే కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది రైతులు బయట రాష్ట్రాలకు చెందిన మార్కెట్లకు ఎగుమతి చేస్తూ మంచి ధర పొందుతున్నారు. జిల్లా నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు 70 శాతానికి పైగా ఎగుమతి అవుతున్నట్లు తెలుస్తోంది. కొంతమంది వ్యాపారులు చెన్నై, బెంగళూరు, హైదారాబాద్ మార్కెట్లలో అమ్మకాలు చేస్తున్నారు.



కాయలతో ఉన్న బత్తాయి చెట్టు



ఈ రైతు పేరు సయ్యద్ గాస్‌మొయిద్దీన్. ఇతనికి ఉదయగిరి మండలం దాసరిపల్లిలో 5 ఎకరాల బత్తాయి తోట ఉంది. వైఎస్సార్ పాలనలో వర్షాలు బాగా కురిసి మంచి దిగుబడులు వచ్చి ధరలు బాగుండడంతో కొంత మేర ఆదాయం వచ్చింది. ఆ తర్వాత చంద్రబాబు పాలనలో కరువు వచ్చి కొంతమేర తోట ఎండిపోయింది. మరలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఏటా వర్షాలు సమృద్ధిగా కురిసి చెట్లు జీవం పోసుకొని దిగుబడులు బాగా పెరిగాయి. గత నాలుగేళ్లుగా ధరలు కూడా బాగుండడంతో ఆదాయం పెరిగింది. ఈ వేసవిలో మంచి దిగుబడులు పొంది రూ.2 లక్షల వరకు ఆదాయం లభించింది.

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు



జిల్లాలో బత్తాయి సాగు గత మూడేళ్ల నుంచి క్రమేణా పెరుగుతోంది. గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. ఈ ఏడాది 41,324 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. రైతులకు ఎకరాకు మూడేళ్ల కాలపరిమితికి రూ.21 వేలు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది. ఉపాధి హామీ పథకంలో ఎకరాకు రూ.1.20 లక్షల సబ్సిడీ రూపంలో అందిస్తోంది. డ్రిప్ సామగ్రిని దరఖాస్తు చేసుకున్న 20 రోజుల్లోపే మంజూరు చేస్తున్నాం.

– మద్దిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి

‘విద్యాదీవెన’తో ఉన్నత చదువులకు భరోసా

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- జిల్లాలో 46,031 మంది విద్యార్థులకు రూ.34.45 కోట్ల జమ



జగనన్న విద్యాదీవెన నమూనా చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, జేసీ తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట): పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ‘జగనన్న విద్యాదీవెన’ పథకాన్ని అమలు చేస్తూ అండగా నిలుస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. సోమవారం ‘జగనన్న విద్యాదీవెన’ మూడో త్రైమాసిక నిధుల జమ కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లా నగరి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించగా, నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి వర్చువల్‌గా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, జిల్లా స్థాయి అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో గతంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించగా, ఆ పథకాన్ని ఎందరో పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారని గుర్తుచేశారు. తండ్రి స్ఫూర్తితో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాలను ప్రవేశపెట్టి క్రమం తప్పకుండా నిధులు విడుదల చేస్తూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా జిల్లాలోని 46,031 మంది విద్యార్థులకు సుమారు రూ.34.45 కోట్లను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ముఖ్యమంత్రి జమ చేశారని తెలిపారు. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు చేపట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ రమేష్, గిరిజన సంక్షేమశాఖ పీఓ డాక్టర్ మంద రాణి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, మైనార్టీ సంక్షేమ అధికారి నిర్మలాదేవి, హాస్టళ్ల సంక్షేమ అధికారులు, వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో జగనన్న విద్యాదీవెన వివరాలు

కమ్యూనిటీ	విద్యార్థుల సంఖ్య	అందిన నగదు
ఎస్సీ	11,524	రూ.8,55,94,990
ఎస్టీ	1,670	రూ.1,05,02,729
బీసీ	17,944	రూ.13,09,13,918
ఈబీసీ	7,519	రూ.6,46,35,546
ముస్లిం	4,718	రూ.3,20,12,284
కాపు	2,506	రూ.1,99,24,369
క్రిస్టియన్	110	రూ.8,83,602

తల్లిదండ్రులు ధీమాగా ఉంటున్నారు



మాది చేజర్ల మండలం ఓబులాయపల్లి గ్రామం. నేను నెల్లూరులో హాస్టల్లో ఉంటూ డీకేడబ్ల్యూ కళాశాలలో చదువుతున్నాను. ఇంటర్‌లో అమ్మఒడి, డిగ్రీలో జగనన్న విద్యాదీవెన సాయం అందడంతో మా తల్లిదండ్రులు ఫీజులు చెల్లించేందుకు ఇబ్బంది పడకుండా నన్ను ధీమాగా చదివిస్తున్నారు. జగన్ సార్ ప్రవేశపెట్టే పథకాలన్నీ మాలాంటి విద్యార్థుల ఉన్నత చదువుకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– యు.స్వర్ణ, డీకేడబ్ల్యూ కళాశాల, నెల్లూరు

ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందుల్లేవు



మాది కావలి మండలం ఆనెమడుగు. నేను నెల్లూరులో హాస్టల్‌లో ఉంటూ డీకేడబ్ల్యూ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నాను. నాకు ప్రతి ఏడాది వసతిదీవెన, విద్యాదీవెన పథకాలు అందుతున్నాయి. దీంతో మా నాన్నకు ఫీజుల భారం తగ్గింది. సీఎం జగన్ సార్ అమలు చేస్తున్న ప్రతి పథకం సూపర్. హ్యాట్సాఫ్ సీఎం సార్.

– ఆర్.కృప, డీకేడబ్ల్యూ కళాశాల, నెల్లూరు

రైతులకు అండగా ఆర్బీకేలు

రైతుల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ రైతుభరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంతోపాటు ఆర్బీకేల్లో పనిచేసే సిబ్బంది పంటల సంరక్షణకు రైతులకు తగు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ఆర్బీకేలు తమకు అండగా నిలుస్తున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా
- ఈ రబీ సీజన్ నుంచి పురుగుమందుల విక్రయాలు
- పంటల సాగుపై అవగాహన సదస్సులు
- జిల్లాలో 561 రైతుభరోసా కేంద్రాలు



సీతారామపురంలో ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రం

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తోంది. గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నదాతలకు సేవలందిస్తోంది. జిల్లాలో 561 రైతుభరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి ద్వారా వివిధ రకాల ఎరువులను రైతులు కొనుగోలు చేసేలా తగు ఏర్పాట్లు చేసింది. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపుగా 4,600 మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులను ఆర్బీకేల ద్వారా సిబ్బంది రైతులకు విక్రయించారు. అంతేకాకుండా సబ్సిడీపై పలు రకాల విత్తనాలను కూడా ప్రభుత్వం పంపిణీ చేసింది. ప్రధానంగా ఆర్బీకేల్లో వ్యవసాయ సమాచారానికి సంబంధించిన పలు పుస్తకాలను అందుబాటులో ఉంచుతూ రైతులకు విజ్ఞానాన్ని పెంపొందిస్తోంది.

ఈ రబీ సీజన్ నుంచి..

ఇప్పటి వరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, సబ్సిడీపై విత్తనాలను రైతులకు కావాల్సిన మేరకు ప్రభుత్వం సరఫరా చేస్తోంది. కానీ ఈ ఏడాది రబీ సీజన్ నుంచి వివిధ పంటలకు అవసరమైన పలు రకాల పురుగుమందులను కూడా అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అంతేకాకుండా రైతుభరోసా లబ్ధిదారుల వివరాలు, వివిధ సాంకేతిక సమస్యలతో రైతు భరోసా నగదు పడని లబ్ధిదారులు సమస్యను పరిష్కరించేలా ఆర్బీకేల్లోని సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. అలాగే మూగజీవాలకు ఉచిత టీకాలు అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఆర్బీకేల ద్వారా గ్రామాల్లోనే ఇన్ని సేవలందించడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్నివిధాలుగా సేవలు



రైతుభరోసా కేంద్రాల్లో పంటల సాగుకు అవసరమైన అన్ని సేవలు అందిస్తున్నాం. రైతులు కూడా ఆర్బీకేలను వినియోగించుకునేందుకు అలవాటు పడుతున్నారు. ప్రధానంగా వివిధ వ్యవసాయ సమస్యలను స్థానికంగానే గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా పరిష్కరిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– నర్సోజి, ఏడీ, వ్యవసాయశాఖ

ప్రజాపోరాటాల సైనికుడు గద్దర్



- ప్రొఫెసర్ ఖాసిం

నెల్లూరు(బృందావనం): తన పాట, ఆట, మాటలతో గద్దర్ ప్రజాపోరాటాలకు అండగా నిలిచిన సైనికుడని విప్లవ రచయితల సంఘం నేత, ప్రొఫెసర్ ఖాసిం పేర్కొన్నారు. గద్దర్ సంస్మరణ నిర్వహణ కమిటీ నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో నగరంలోని పురమందిరం ప్రాంగణం రీడింగ్ రూంలో సోమవారం రాత్రి ‘ప్రజా యుద్ధనౌక’ గద్దర్ సంస్మరణ సభ జరిగింది. సభకు సంస్మరణ నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు పద్మక్క అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఖాసిం మాట్లాడుతూ ప్రజల కోసం పోరాటాలు చేసే పలు ప్రజాసంఘాల బలోపేతానికి, ప్రజాఉద్యమం నిరాటంకంగా కొనసాగేందుకు జన నాట్యమండలి వ్యవస్థాపకుడు గద్దర్ కృషి చేశారని తెలిపారు. గద్దర్‌ను పీడిత ప్రజానీకం ఎన్నడూ మరువదన్నారు. ప్రజల మనస్సుల్లో గద్దర్ స్థానం శాశ్వతమన్నారు. గద్దర్‌కు నెల్లూరుతో ఎంతో అనుబంధం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లౌకిక ప్రజాస్వామికవాది జహీర్‌అలీఖాన్‌ను స్మరించారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వొకేట్ ఓజిలి అబ్బాయి రెడ్డి, వివిధ ప్రజాసంఘాల నేతలు ఎం.బ్రహ్మం, రాజనరసింహ, గాలయ్య, శేషయ్య, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. కళాకారులు ఆలపించిన అభ్యుదయ గీతాలు అలరించాయి.

సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ హరినారాయణన్



అర్జీదారులు అందించిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం(స్పందన) అర్జీలకు సంబంధించి అర్జీదారుల సమస్యలను సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవిలతో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయం లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులు కలెక్టర్‌కు తమ సమస్యలను వివరించారు. జాతీయ రహదారి 67 నిర్మాణంలో భాగంగా చేజర్ల మండలం కాకువాయిలో భూమి కోల్పోతున్న వారికి నామమాత్రపు నష్టపరిహారం చెల్లించారని, న్యాయబద్ధం పరిహారం ఇప్పించాలంటూ బాధితులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మర్రిపాడు మండలం కంద్రికకు చెందిన వృద్ధురాలు కుంకు శంకరమ్మ తన కొడుకు-కోడలు తన పొలం 1.64 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆలనాపాలనా చూడకుండా ఇంటి నుంచి గెంటేశారంటూ కలెక్టర్ ఎదుట వాపోయారు. పొదలకూరు మండలం ముదిగేడు వీఆర్ఏ తమ ఆధీనంలో ఉన్న పొలాన్ని ఆక్రమించాడంటూ కొమ్మల మస్తానయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు సాంబశివారెడ్డి, రవీంద్ర, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ కె.రమేష్‌బాబు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, సర్వే రికార్డుల ఏడీ హనుమాన్ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడికి వెళ్లేలా చూడాలి

బడి ఈడు పిల్లలు బడికి వెళ్లేలా చర్యలు తీసుకోవడంతోపాటు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో నూరుశాతం పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశమై జిల్లాలో జరుగుతున్న మన బడి నాడు-నేడు అభివృద్ధి పనుల పురోగతి, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓల నేతృత్వంలో క్షేత్రస్థాయిలో ఎంఈఓలు తప్పనిసరిగా ప్రతిరోజూ సచివాలయాలను సందర్శించి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో వందశాతం జరిగేలా చూడాలని ఆదేశించారు. నాడు-నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

బాబు, పవన్‌లను నమ్మే పరిస్థితి లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: 'ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌లు నాటకాలు ఆడుతున్నారు. వారిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ 19వ వార్డు వవ్వేరులో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు, పవన్‌లు రాష్ట్రంలో పర్యటనలు చేస్తూ డ్రామాలాడుతున్నారని చెప్పారు. వారిని ప్రజలు నమ్మడం లేదని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు రాష్ట్రానికి ఏమీ చేయలేదని తెలిపారు. పవన్ కళ్యాణ్ వ్యాన్ ఎక్కి బాబు రాసిచ్చింది చదవడం, ముఖ్యమంత్రిని తిట్టడమే పనిగా పెట్టుకున్నాడన్నారు. బుచ్చి – వవ్వేరు రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ ప్రత్యేక నిధుల నుంచి రూ.80 లక్షలను సీఎం మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ కింద వవ్వేరు గ్రామంలో రూ.21.80 లక్షలతో ఆర్బీకేను నిర్మించి ప్రారంభించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధా కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మోర్ల మురళి పాల్గొన్నారు.

గ్రాఫిక్స్‌తో మళ్లీ మోసం చేసే యత్నం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు పలు రకాల గ్రాఫిక్స్‌ను సిద్ధం చేస్తున్నారు. గత ఎన్నికల్లో అమరావతి గ్రాఫిక్స్ నమ్మక ఓటమి పాలవడంతో ఈసారి మరో విధంగా వస్తున్నారు.' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో చంద్రబాబు ఓట్ల కోసం వందలకొద్దీ హామీలిచ్చి.. తీరా గెలిచాక ప్రజలను మోసం చేశారన్నారు. బాబు ఇచ్చే హామీలను చూసి చూసి ప్రజలు విసిగిపోయారన్నారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను విడుదల చేసి, దానిని చిత్తశుద్ధితో అమలు చేస్తానని ప్రకటించారన్నారు. దీంతో జనం ఆయనకు జై కొట్టి కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారన్నారు. చంద్రబాబు నాయుడు 2019 ఎన్నికలప్పుడు తాను చెప్పినవన్నీ చేశానని, మళ్లీ గెలిపిస్తే ఇంకా చాలా చేస్తానంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆర్థికంగా అండగా నిలిచారన్నారు. అందుకే ప్రజలు చంద్రబాబంటే వంచన, జగన్ అంటే విశ్వసనీయత అంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, గుడ్లూరు మాల్యాద్రి, పోతనబోయిన వేణుగోపాలరావు, రమణమ్మ, పులి రజని, చక్రపాణి, సైకిలాబ్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

నవరత్నాలతో పేదలకు ఆర్థిక భరోసా



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

సీతారామపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో పేదలకు ఆర్థికంగా భరోసా లభించిందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని అయ్యవారిపల్లి సచివాలయ పరిధిలోని పోలంగారిపల్లి, దేవిశెట్టిపల్లి గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించారు. బుక్‌లెట్లు పంపిణీ చేసి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల్లోనే 99 శాతం హామీలను సీఎం నెరవేర్చారన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. రాజకీయాల్లో జగన్‌మోహన్‌రెడ్డి విజన్ కలిగిన నాయకుడని, 2024 ఎన్నికల్లో ఆయన మళ్లీ సీఎం అవడం ఖాయమన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు మోసకారి అని చెప్పారు. ప్రజలు మరోసారి బాబు మాటలు విని మోసపోకుండా జగనన్నకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య, మండల ఉపాధ్యక్షుడు బసిరెడ్డి కృష్ణారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ బాలినేని మాబయ్య, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చప్పిడి తిరుపతిరెడ్డి, నాయకులు తిరుమలరెడ్డి, తిరుపాలు, రామచంద్ర, రేనాటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిడుగు రామమూర్తి మహోన్నత వ్యక్తి



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): గిడుగు రామమూర్తి మహోన్నత వ్యక్తి అని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. ప్రజలకు ఆయన తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసేందుకు గిడుగు రామమూర్తి ఎనలేని కృషి చేశారని, ఆయన జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.

ఇంటికెళ్తుండగా..

- టిప్పర్ ఢీకొని మహిళ మృతి

కోవూరు: మోటార్‌బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందిన ఘటన సోమవారం కోవూరు మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. దగదర్తి మండలం బోడిగుడిపాడు దళిత కాలనీకి చెందిన బుట్టా సునీత (26), ఆమె భర్త రమేష్ కలిసి మోటార్‌బైక్‌పై నెల్లూరు బ్యాంక్ ఆఫ్ బరోడాకు వెళ్లారు. పని ముగిసిన తర్వాత ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో కోవూరు మండలం పడుగుపాడు లారీ యార్డు వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి టిప్పర్ వేగంగా బైక్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరూ కింద పడిపోయారు. అదే సమయంలో సునీత తలపై టిప్పర్ ఎక్కింది. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సురేష్ స్వల్పంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

ప్రతి గడపలో సంక్షేమ కాంతులు

- కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

గుడ్లూరు: 'రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా గడప గడపలో సంక్షేమ కాంతులు కనిపిస్తున్నాయి. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోంది.' అని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పరకొండపాడు గ్రామ సచివాలయం పరిధిలో కొండారెడ్డి పాళెం, అగ్రహారం, పరకొండపాడు గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి బుక్‌లెట్లు అందజేశారు. భూముల రీ సర్వేలో రెవెన్యూ అధికారులు తనకున్న 50 సెంట్లను తగ్గించి చూపించారని సుబ్బరాయుడు అనే రైతు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రాగా వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. కరెంట్ స్తంభాలు మార్చాలని, గృహాలు మంజూరు చేయించాలని, గుడి నిర్మాణానికి సహకరించాలని పలువురు కోరగా ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పులి రమేష్, జెడ్పీటీసీ కోర్సిపాటి బాపిరెడ్డి, సర్పంచ్ కొండయ్య, తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్, వైద్యాధికారి మారుతీరావు, ఎంఈఓ గోవర్ధన్, ఏఓ రవి కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బిల్లా రమణయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ, బ్రహ్మయ్య, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి హైడ్రామా

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం హైడ్రామా ఆడారు. అనుమతి లేకుండా చలో మినగల్లు కార్యక్రమం నిర్వహించేందుకు ఆయన మాగుంటలేవుట్‌లోని తన కార్యాలయం నుంచి సోమవారం బయలుదేరారు. అయితే పోలీసులు ఈ కార్యక్రమానికి ముందస్తు అనుమతి లేదని అడ్డుకున్నారు. ఎటువంటి నోటీసులు ఇవ్వలేదంటూ శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయం ముందు బైఠాయించారు. ఈ నేపథ్యంలో రెండుగంటలపాటు హైడ్రామా జరిగింది. చివరికి పోలీసులు నోటీసులు ఇవ్వడంతో ఎమ్మెల్యే కార్యాలయంలోకి వెళ్లిపోయారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 140
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 266
లేయర్ చికెన్	: 178

బాధితులకు సత్వర న్యాయం

నెల్లూరు(క్రైమ్): స్పందన వినతులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఏఎస్పీ డి.హిమవతి పోలీస్ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 99 మంది తమ సమస్యలను వినతుల రూపంలో ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, డీఎస్పీలకు అందజేశారు. ప్రధానంగా ప్రేమ పేరిట మోసగించారని, అధిక కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారని, ఉద్యోగాల పేరిట మోసం చేశారని, దొంగతనం కేసుల్లో రికవరీ లేదని తదితరాలపై వినతులు అందాయి. వాటిని పరిశీలించిన ఏఎస్పీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రేమ పేరిట యువతులను మోసగిస్తున్నారని, వారి వ్యక్తిగత సమాచారం, ఫొటోలు తీసుకుని వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మిస్సింగ్, దొంగతనం కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన కేసులను పరిష్కరించాలన్నారు. స్పందన వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శిరీష, ఏఆర్ డీఎస్పీ గాంధీ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



సమస్య తెలుసుకుంటున్న ఏఎస్పీ హిమవతి

చట్ట ప్రకారమే ఉత్తర్వులిచ్చాం

నెల్లూరు సిటీ: కందుకూరులో తల్లి, కుమారుడికి మధ్య నెలకొన్న ఆస్తి వివాదానికి సంబంధించి హక్కుదారులను నిర్ధారించే అధికారం రిజిస్ట్రేషన్ అధికారులకు లేదని, చట్ట ప్రకారమే తాము ఉత్తర్వులు ఇచ్చామని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు సోమవారం ప్రకటనలో తెలిపారు. తమ శాఖకు, పోలీసు అధికారులకు సివిల్ వివాదాలను పరిష్కరించే అధికారం లేదన్నారు. సదరు వివాదాస్పద స్థలానికి సంబంధించి బాధితులు సివిల్ కోర్టును ఆశ్రయించాలని తెలియజేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.9



క్రీడా ప్రతిభా పురస్కారాల ప్రదానం నేడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా ప్రతిభా పురస్కారాలను మంగళవారం ప్రదానం చేస్తామని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ క్రీడల దినోత్సవం నాడు క్రీడాకారులకు, వారికి శిక్షణ ఇచ్చిన గురువులకు నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేస్తున్నామన్నారు. 12 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఈ ఏడాది ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో 763 మంది క్రీడాకారులకు, వారికి శిక్షణ ఇచ్చిన గురువులతోపాటు క్రీడారత్న అవార్డును అథ్లెట్, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు, క్రీడా గురువు అవార్డును అలనాటి క్రీడాకారిణి, విక్రమ సింహపురి యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సభ్యురాలు రవీంద్రమ్మకు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని వివరించారు. అవార్డులకు ఎంపికైన వారు మధ్యాహ్నం 2.30 గంటలకు స్టేడియంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీర వెంకటేశ్వర్లు వద్ద పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీన ఉదయం 10.30 గంటలకు నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు హాజరుకానున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై చర్చించనున్నారు. ప్రజాప్రతినిధులతోపాటు కలెక్టర్ ఎం.హరినారాయణన్, వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారు.

నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

నెల్లూరు(పొగతోట): పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని తన కార్యాలయంలో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యదర్శులను బ్యాచ్‌ల వారీగా విభజించి పాలనాపరమైన అంశాలపై మంగళవారం నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు. వారంతా శిక్షణకు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కొడవలూరు: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొడవలూరు – పడుగుపాడు రైల్వేస్టేషన్ల మధ్య అప్‌లైన్‌లో ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసులు సోమవారం వివరాలు వెల్లడించారు. 50 – 55 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి ఆదివారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతను గోధుమ రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, పచ్చ రంగు లుంగీ ధరించి ఉన్నాడు.

వివాహిత బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాలో మరే ఇతర కారణమో తెలియదు కానీ ఓ వివాహిత తన ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాయాజీ వీధిలో శంకర్‌రామ్, దేవి (21) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఏడాదిన్నర క్రితం వివాహమైంది. శంకర్‌రామ్ నగరంలో మొబైల్‌షాపు నిర్వహిస్తున్నాడు. కారణం తెలియదు కానీ అతని భార్య సోమవారం ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయంపై సమాచారం అందుకున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరాతీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.